ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జోగుళాంబ గద్వాల జిల్లా వార్తలు
గురువారం 16 జనవరి 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 । కనిష్ఠం : 19.0





తూడుకుర్తిలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

ఆర్డీఎస్‌కు.. సాగునీరొచ్చింది


మేడికొండ గ్రామం డీ-16 వద్ద నాలుగడుగుల పైనే పారుతున్న సాగునీరు

- ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాలకు స్పందన
- మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావుల ప్రత్యేక చొరవ
- ఏపీ ప్రభుత్వం 2.5 టీఎంసీల ఇండెంట్‌కు అంగీకారం, 14న విడుదల
- అలంపూర్ రైతులకు తీరనున్న సాగునీటి ఇబ్బందులు
- ఈ నెల 18 నుంచి తుమ్మిళ్ల లిఫ్టు ద్వారా సాగునీరు అందించేందుకు చర్యలు


రాజోళిబండ ఆనకట్ట వద్ద నిండుగా పారుతున్న తుంగభద్రనది


ఆనకట్ట వద్ద తెలంగాణ వైపుకు నిండుగా పారుతున్న ఆర్‌డీఎస్ కాలువ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆర్డీఎస్ రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగనున్నాయి. యాసంగి సాగుకు నీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు కాస్త ఊరట లభించింది. ఆర్డీఎస్ సాగునీటి సమస్యపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన వరుస కథనాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు. అలంపూర్ నాయకులు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావుల దృష్టికి తీసుకువెళ్లి ఉమ్మడి ఇండెంట్ పెట్టించేందుకు చొరవ తీసుకున్నారు. దీంతో ఈ నెల 14వ తేదీన ఏపీ అధికారులు తుంగభద్ర డ్యామ్ నుంచి 2.5 టీఎంసీల సాగునీటికి ఇండెంట్ పెట్టి విడుదల చేయించారు. ఈ నెల ఎనిమిదో తేదీన పెట్టిన ఒక టీఎంసీ ఇండెంట్ నీరు బుధవారం రాజోళిబండ ఆనకట్ట వద్ద 8.2 అడుగుల ఎత్తులో ప్రవాహం ఉంది.. ఈ నెల 18 నుంచి మూడో టీఎంసీకి ఇండెంట్ పెట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. దీంతో ఆర్డీఎస్ ఆయకట్టులో యాసంగి సాగుకు ఢోకా లేదని అధికారులు, రైతులు సంబురపడుతున్నారు.

6

- అయిజటౌన్, ఆంధ్రజ్యోతి

మల్లయ్య స్వామికి కోటి దండాలు

7

చేపల వేటకు వెళ్లి ఇద్దరి మృతి

- నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో సంఘటనలు

వార్త 7లో..

వైభవంగా కల్యాణోత్సవం

- ప్రారంభమైన సింగోటం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

7

నరసింహ స్వామీ నమోస్తుతే

- సంగినేపల్లిలో వైభవంగా ఉత్సవాలు
- ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లలో తరలివచ్చిన రైతులు

7

అన్నింట్లో వెనుకబడిన అలంపూరు

- ఇబ్బందుల్లో ఉన్న ఆర్డీఎస్ రైతాంగం
- పార్లమెంట్ మాజీ సభ్యుడు సురవరం సుధాకర్‌రెడ్డి

7

ఉత్సాహంగా అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

6

రేపటి నుంచి గంధోత్సవం

6

గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టేలా వృషభరాజముల పోటీలు

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి

కందనూలు/పదర/కోడేరు/పెద్దమందడి/మానవపాడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పర్వదినాన్ని ఉమ్మడి జిల్లాలో సంబురంగా జరుపుకొన్నారు. వివిధ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల వద్ద ఎద్దుల బండ్లతో ప్రదక్షిణలు చేశారు. గ్రామాల్లో క్రీడా పోటీలు నిర్వహించి ప్రముఖుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తూడుకుర్తిలో అంతరాష్ట్ర సీనియర్ విభాగం వృషభరాజుముల బండలాగుడు పోటీలను బుధవారం ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి ప్రాముఖ్యతనిస్తూ రైతులకు నూతనోత్తేజాన్ని కలిగించేందుకు ఇలాంటి పోటీలు నిర్వహించేందుకు అందరూ సహకరించాలన్నారు. గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే విధంగా ఈ పోటీలను ఏర్పాటు చేసిన నిర్వాహకులకు అభినందించారు. ఈ పోటీల్లో తాడూరు మండలం యాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అఖిలేష్‌రెడ్డి వృషభరాజులు ప్రథమ స్థానం, నంద్యాల నాగయ్యకు చెందిన వృషభరాజులు ద్వితీయ స్థానం, నంద్యాల నాగయ్యకు చెందిన వృషభరాజములు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలుగా నిలిచిన వృషభరాజముల యజమానులకు ప్రథమ రూ.70వేలు, ద్వితీయ రూ.60 వేలు, తృతీయ బహుమతిగా రూ.50వేల నగదును ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రదానం చేశారు. అదేవిధంగా అచ్చంపేట మండలంలోని ఉడిమిళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రారంభించారు. నల్లమల ఉనికి చాటిచెప్పడంలో పశుజాతి ముందంజలో ఉందని సంతోషం వ్యక్తం చేశారు. జీవ వైవిధ్యంలో ప్రత్యేక లక్షణాలు కలిగిన నల్లమల తురుపు జాతి గిత్తలు రాష్ట్రానికే తలమానికం అని త్వరలో వాటికి రాష్ట్ర స్థాయి గుర్తింపు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కోడేరు మండలంలోని ఎత్తం గట్టు రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. మూడు రోజుల నుంచి పూజలందుకున్న రామలిగేశ్వరస్వామి బుధవారం సాయంత్రంతో ఉత్సవాలు ముగిశాయి. కాలినడకన బయలు దేరిన భక్తులకు తాగునీరు, అన్నప్రసాదం తదితర సౌకర్యాలు, ఎత్తం కొండ్రావుపల్లి, కోడేరు తదితర గ్రామాల భక్తులు కల్పించారు. వనపర్తి జిల్లా పెద్దమండడి మండలంలోని వీరాయిపల్లి వేంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో మంగళవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూరు ఎమ్మెల్యే విజయుడు మానవపాడు మండలంలోని బోరవెల్లిలో కబడ్డీ పోటీలను ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయని తెలిపారు.


ఉడిమిల్లలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

ఖిల్లా గట్టుకు పోటెత్తిన భక్తులు

- భక్తిశ్రద్ధలతో వీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు

ఖిల్లాఘణపురం, జనవరి15 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని ఖిల్లా గట్టుపై వెలసిన వీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు పోటెత్తారు. కాకతీయుల కాలంలో పూజలందుకున్న వీరాంజనేయ స్వామికి సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి పంచామృత అభిషేకం, సంక్రాంతి జ్యోతి ప్రజ్వలన తదితర పూజలు చేశారు. మకర సంక్రాంతి సాయంత్రం మహా మంగళహారతిని వీక్షించిన అనంతరం ఆంజనేయస్వామి మాలధారణ భక్తులు దీక్షను విరమించారు. కాకతీయులకాలం నాటి కోటగోడలు, కట్టడాలు, ప్రధాన ముఖద్వారాలు, నేతిగుండం, పాలగుండం, కోటపై గల ఫిరంగులను భక్తులు ఆసక్తిగా చూశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం గుట్టపై అన్ని ఏర్పాట్లు చేశారు.


వీరాంజనేయ స్వామి ఆలయం ఆవరణంలో భక్తుల సందడి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- కారు, ఆటో ఢీకొని ఇద్దరు, సుమో, స్కూటీ ఢీకొని మరొకరు
- తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు
- బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ధర్నా
- ఆందోళన విరమింపజేసిన సీఐ నాగార్జున


బంగారయ్య (ఫైల్)


మహేష్ (ఫైల్)

7

పాము కాటుతో అత్తాకోడళ్ల మృతి

- వారం వ్యవధిలో ఒకే స్థలంలో సంఘటనలు
- వీపనగండ్ల మండలం వల్లభాపురంలో ఘటన

7

చెన్నై బయల్దేరిన పీయూ క్రికెట్ జట్టు

- నేటి నుంచి ఆలిండియా సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రీడలు

సంబురంగా సంక్రాంతి

- ఇంటి ముంగిళ్లలో ముగ్గుల హరివిల్లు
- గాలిపటాలు ఎగరవేసిన చిన్నారులు


గద్వాల రాఘవేంద్రకాలనీలో చేనేత చీర నమూనాలో తీర్చిదిద్దిన ముగ్గు

గద్వాల టౌన్/వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సంప్రదాయంలో మూడు రోజులు జరుపుకునే సంక్రాంతి పండుగ మంగళవారం గద్వాల, వనపర్తి జిల్లాలో ప్రజలు సంబురంగా జరుపుకున్నారు. మహిళలు తెల్లవారుజామునే ఇళ్ల ముందు రంగురంగుల ముత్యాల ముగ్గులు వేశారు. పండుగ సందర్భంగా ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. సహజంగా సంక్రాంతి పండుగ సందర్భంగా హరిదాసుల వేషధారణలో వచ్చేవారు, గంగిరెద్దుల వారితో పలు వీధులు కళకళలాడాయి. గద్వాల పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలోని చేనేత కళాకారులు వాటర్ ట్యాంక్ సమీపంలోని ఆవరణలో గద్వాల జరీ అంచు చీరను పోలిన ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదేవిధంగా వనపర్తి పట్టణంలో మహిళలు ఇళ్ల ముందు పెద్ద పెద్ద ముగ్గులు వేసి గొబ్బెమ్మలను ఉంచి పూజలు చేశారు. చిన్నారులు, పెద్దలు గాలి పటాలు ఎగరవేశారు. నోరూరించే పిండి వంటలతో సంక్రాంతి ని మరింత వైభవంగా జరుపుకున్నారు. పట్టణాల్లో, గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. పలు గ్రామాల్లో క్రికెట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.


గద్వాల భీంనగర్‌కాలనీలో గంగిరెద్దును ఆడిస్తున్న కళాకారుడు

సాగునీటి కోసం.. రోడ్డెక్కిన రైతులు

వడ్డేపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : రబీలో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు రోడ్డెక్కి బైఠాయించిన ఘటన మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా శాంతినగర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో జరిగింది. సాగునీరు వదిలి పంటలను కాపాడాలని మొక్కజొన్న కంకులను చేతపట్టిన రైతులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్ల సాగునీటి సరఫరా నిలిచిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుంగభద్ర డ్యాంలో 72 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ అధికారులు పంటల సాగుకు నీరు వదలకపోవడం బాధాకరమన్నారు. రాజకీయ జోక్యం వల్లే సాగునీరు విడుదల విషయంలో రైతులను మోసం చేస్తున్నారన్నారు. పంటల సాగుకు లక్షలాది రూపాయల పెట్టుబడి పెట్టి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. మార్చి నెల వరకు సాగునీరు ఇవ్వకపోతే ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. 30 వేల ఎకరాలకు పైగా పంటలు ఎండిపోయే దుస్థితి ఉన్నదని రోడ్డెక్కితే పోలీసులు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం శాంతినగర్ ఎస్ఐ సంతోష్ పరిస్థితిని గమనించి ఆందోళనకు అనుమతి లేదంటూ విరమింపజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ భర్త సూరి, మనపిరెడ్డి, ఆంజనేయులు, వెంకటేశు, రాముడు, శేషన్న, రంగస్వామిలతో పాటు వడ్డేపల్లి, శాంతినగర్, పైపాడు, రామాపురం, జిల్లేడుదిన్నె, కోవెలదిన్నె తదితర గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు.


శాంతినగర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో బైఠాయించిన రైతులు

క్రీడలతో సత్సంబంధాలు

అయిజటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు వ్యక్తుల మధ్య సత్సంబంధాలను పెంపొందిస్తాయని స్పోర్ట్స్ అథారిటీ రాష్ట్ర మాజీ చైర్మన్ ఆంజనేయులు గౌడు అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో 13 రోజులుగా జరుగుతున్న అయిజ ప్రీమియర్ లీగ్ సీజన్-9 క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి బుధవారం ఆయన హాజరై మాట్లాడారు. క్రమంగా యువతి, యువకులు క్రీడలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయిజ ప్రీమియర్ లీగ్ సీజన్-9 క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతి డబ్ల్యూటీఎఫ్ టీమ్, ద్వితీయ బహుమతిని న్యూ గీతాంజలి ఫైటర్స్ టీమ్, తృతీయ బహుమతి యూనిక్ స్పోర్ట్స్ టీమ్ గెలుపొందారు. విజేత జట్ల సభ్యులకు ఆంజనేయులు గౌడు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు తదితరులు పాల్గొన్నారు.


ట్రోఫీ అందిస్తున్న ఆంజనేయులు గౌడు

కనుల పండువగా శివపార్వతుల ఊరేగింపు

- భక్తిశ్రద్ధలతో ప్రభోత్సవం
- అలరించిన అఘోరాల విన్యాసాలు
- విద్యుత్ దీపాలంకరణతో అమ్మవారి ఊరేగింపు

అచ్చంపేటటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని భ్రమరాంబికాదేవి ఆలయంలో శివపార్వతుల ఊరేగింపు కార్యక్రమం బుధవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. నేడు ఉమామహేశ్వరంలోని భోగ మహేశ్వరంలో జరిగే శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి భ్రమరాంబికా దేవిని అచ్చంపేట ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ప్రభోత్సవంలో చిన్నారుల సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాశీ నుంచి వచ్చిన అఘోరాలు చేసిన ఖడ్గాలు, అగ్గితో చేసిన విన్యాసాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ అధ్వర్యంలో అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, అనురాధ దంపతులు హాజరై అమ్మవారికి పూజలు చేశారు.


అచ్చంపేటలో నిర్వహించిన ప్రభోత్సవానికి తరలివచ్చిన భక్తులు

ప్రభోత్సవంలో స్వల్ప ఘర్షణ

పట్టణంలోని భ్రమరాంబికాదేవి ఆలయంలో బుధవారం రాత్రి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆలయంలో పూజలు చేస్తున్న సమయంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దంప తులతో కలిసి ఆలయానికి వచ్చారు. మాజీ ఎమ్మెల్యేను కొద్దిసేపు ఆగమని పోలీసులు తెలిపారు. దీంతో ఆయన పార్టీ నాయకులతో కలిసి లోపలికి వెళ్లేందుకు యత్నించడంతో ఘర్షణ వాతవరణం ఏర్పడింది. మాజీ ఎమ్మెల్యే నాయకులతో కలిసి ప్రభ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు వారికి నచ్చజెప్పి పంపించారు. అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్, ఎస్సైలు, ప్రత్యేక బెటాలియన్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఇంటింటా పల్లె పండుగ

● అంబరాన్నంటిన సంక్రాంతి సంబురాలు



పాలెం వెంకన్న ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ఎడ్ల బండ్లు

బిజినేపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటా గ్రామీణ జీవితాన్ని ప్రతిబింబించే సంక్రాంతి పండుగను ప్రజలు సంబురంగా జరుపుకున్నారు. మంగళవారం సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని మండలంలోని ఆయా గ్రామాల్లో అన్నదాతలు ట్రాక్టర్లను, ఎద్దుల బండ్లను అందంగా అలకరించుకొని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేసి సామూహికంగా ఎద్దుల బండ్ల ఊరేగింపు చేపట్టారు. వచ్చిన బంధువులకు వివిధ రకాల రుచికరమైన పిండి వంటలు చేసి ఆతిథ్యం ఇచ్చారు. అనంతరం కుటుంబ సమేత పాలెం, వట్టెం, బిజినేపల్లి, వడ్డెమాన్ గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు పోటెత్తడంతో భక్తులతో ఆలయాలు కిట కిటలాడాయి. బుధవారం కనుమ పండుగను ఘనంగా చేసుకున్నారు.

ఈ సందర్భంగా నంది వడ్డెమాన్‌లో నిర్వహించిన ఎద్దుల బండ్ల ఊరేగింపులో అపశ్రుతి చోటు చేసుకుంది. చెన్నకేశవ ఆలయం సమీపంలో ఎద్దులు బెదిరి బండి అదుపు తప్పడంతో అల్వాల్ రెడ్డి అనే యువకుడు ఎద్దుల బండి కింద పడ్డాడు. బండిపై ఉన్న అశోక్ రెడ్డి ఎద్దుల బండిని అదుపు చేయడంతో ఎద్దు కిందపడి పోయింది. వెంటనే తేరుకున్న చుట్టుపక్కల ఉన్న గ్రామస్థులు ఎద్దును, అల్వాల్ రెడ్డిని ప్రాణాపాయం నుంచి కాపాడారు. ఖానాపూర్, బిజినేపల్లి, పాలెం, మంగనూర్ తదితర గ్రామాల్లో ఎద్దుల బండ్ల ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. లట్టుపల్లిలో సంక్రాతి పండుగ పురస్కరించుని మాజీ సర్పంచ్ హన్మనాయక్ స్మారక క్రికెట్ పోటీలు నిర్వహించగా పోటీల్లో పాల్గొన్న జట్లకు పూల్యానాయక్, గోవిందు నాయక్, శాంతి కృష్ణనాయక్‌లు డ్రెస్‌లను అందజేయడంతో పాటు ప్రైజ్ మనీ రూ.50 వేలు అందజేసి క్రీడాకారులను ప్రోత్సహించారు.

ఇత్తడి తొడుగు చేయించేందుకు

రూ. 2. 54 లక్షలు అందజేత

తిమ్మాజిపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తిమ్మాజిపేట మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై స్వయంగా వెలసిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఐదు దర్వాజాలకుగాను ఇత్తడి తొడుగు చేయించేందుకు చిలుక సునీత, భాస్కర్‌రెడ్డి కుమార్తెలు హైదరాబాద్‌కు చెందిన మన్నీపూర్ సుష్మ, వంశీకృష్ణారెడ్డి, శ్రుతి, శ్రీమంత్‌రెడ్డిలు, అదేవిధంగా చిలుక సుధారాందేవ్‌రెడ్డిల కుమార్తె కదిరే మనీషా మణిదీప్ రెడ్డిలు 2లక్షల 54వేల నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు నిర్వహించే అన్నదాన నిధికి చిలుక మంజుల రామచంద్రారెడ్డి, దివ్య వివేక్‌రెడ్డి, రజిత భాస్కర్‌రెడ్డి, యాదమ్మల జ్ఞాపకార్థమై అప్పల అంజనేయులు అలివేలు కృష్ణారెడ్డి, శ్రీలత రఘుమారెడ్డి, అనురాధ రంజిత్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి 10116రూపాయలు అందజేశారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన స్వామి వారి కల్యాణ పట్టు వస్త్రాల వేలం పాటలో ఒక లక్ష 116రూపాయలకు పట్టు వస్త్రాలను దక్కించుకున్నారు. అమ్మవారి వడ్డాణం కోసం చిలుక సరిత, భాస్కర్‌రెడ్డిల కుమారుడు హర్షిత్‌రెడ్డి 20016రూపాయలు అందజేశారు. ఎదిరేపల్లి గ్రామానికి చెందిన వల్లపురెడ్డి, వెంకటరెడ్డి కుమారుడు అనిత నవీన్‌రెడ్డి దంపతులు స్వామివారి కలశాలకు 95వేల 116రూపాయలు విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

రేపటి నుంచి గంధోత్సవం



కొల్లాపూర్ పట్టణంలో హజరత్ సయ్యద్ షా ఖాదర్ బాషా దర్గా

కొల్లాపూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కుల మతాలకు అతీతంగా భక్తులు కొలిచే హజరత్ సయ్యద్ షా ఖాదర్‌బాషా దర్గా గంధోత్సవం ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. 17వ తేదీ సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని జామ మసీద్ నుంచి ఖాదర్ బాషా దర్గా గంధోత్సవం బయలుదేరి పట్టణ పుర వీధుల గుండా ఊరేగింపుగా కొనసాగుతూ దర్గా వద్ద చేరుకుని ప్రత్యేక ప్రార్థనలతో గంధోత్సవ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. 18వ తేదీన మధ్యాహ్నం ఖాదర్ బాషా దర్గా వద్ద భక్తులకు అన్నదానం, రాత్రి 8 గంటలకు మహమ్మత్ ఆదిల్ హస్సేన్ గ్రూప్ హైదరాబాద్ వారిచే కవ్వాలి కార్యక్రమం నిర్వహించబడుతుంది. 19వ తేదీ ఉదయం ఖాదర్ బాషా దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుందని ఉత్సవాల నిర్వాహకులు, పట్టణ ముస్లింలు పేర్కొన్నారు. 350 సంవత్సరాలకు పైబడిన పురాతన ప్రాచీన మహిమ గల ఖాదర్ బాషా దర్గా ఉర్సుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు కుల మతాలకతీతంగా పెద్ద ఎత్తున హాజరు కానున్నారు. కొల్లాపూర్ పట్టణంలోని నల్లమల కొండల సమీపాన 3 కి.మీ దూరంలో వెలసిన హజరత్ సయ్యద్ షా ఖాదర్ బాషా దర్గా ఉర్సు ఉత్సవాలను ఈ ఏడాది నిర్వాహకులు ఘనంగా నిర్వహించనున్నారు. ఉర్సు ఉత్సవాలకు రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక పురావస్తు సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆర్డీఎస్‌కు సాగునీరొచ్చింది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాలకు స్పందన
- మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవ
- ఏపీ ప్రభుత్వం 2.5 టీఎంసీల ఇండెంట్‌కు అంగీకారం
- అలంపూర్ రైతులకు తీరనున్న సాగునీటి ఇబ్బందులు
- ఈ నెల 18 నుంచి తుమ్మిళ్ల లిఫ్టు ద్వారా అందించేందుకు చర్యలు

అయిజటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వంలోని పెద్దల చొరవతో ఆర్డీఎస్ రైతులకు సాగునీటి ఇబ్బందులు తీరనున్నాయి. పదిరోజుల నుంచి ఆర్డీఎస్‌కు తెలంగాణ ఇరిగేషన్ అధికారులు పెట్టిన రెండు టీఎంసీల ఇండెంట్‌తో



తెలంగాణలోకి ప్రారంభమైన డి-12ఎ వద్ద 5 అడుగులు పారుతున్న ఆర్‌డీఎస్

నీరు సక్రమంగా అందక రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని ఆంధ్రజ్యోతి దినపత్రిక వరుస కథనాలు ప్రచురించింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ఇండెంట్ల ద్వారా అయితేనే అలంపూర్ రైతులకు పూర్తిస్థాయి సాగునీరు అందుతుందని ఈ నెల 12న ప్రత్యేక కథనం ప్రచురించింది. విషయం గ్రహించిన అలంపూర్ నా యకులు నీటిపారుదల శాఖ మం త్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావుల దృష్టికి తీసుకువెళ్లి ఉమ్మడి ఇండెంట్ పెటించేలా చొరవ తీసుకున్నారు. ఆర్డీఎస్ రైతుల పరిస్థితిని గమనించిన మంత్రులు ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ ఇన్ చీఫ్ అధికారులతో మాట్లాడి కేసీ కెనాల్‌కు 2.5 టీఎంసీల సాగునీరు ఇండెంట్ పెట్టేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఈ నెల 14వ, తేదీనే ఏపీ అధికారులు తుంగభద్ర డ్యామ్ నుంచి 2.5 టీఎంసీల సాగునీరు ఇండెంట్ పెట్టి విడుదల చేశారు.

ఆనకట్ట వద్ద 8.2 అడుగులు..

తెలంగాణ ఇరిగేషన్ అధికారులు ఈ నెల ఎనిమిదో తేదీన పెట్టిన ఒక టీఎంసీ ఇండెంట్ నీరు బుధవారం రాజోళిబండ ఆనకట్ట వద్ద 8.2 అడుగుల ఎత్తులో ప్రవాహం ఉంది.. ఈ నీరు తెలంగాణ సరిహద్దు సింధనూరు గ్రామం వరకు వచ్చే సరికి ఐదు అడుగుల మేర ఉంది. డీ-12ఎ నుంచి-18 వరకు 4 నుండి 3 అడుగుల వరకు పారుతున్నాయి. ఈనెల 18 నుంచి మూడో టీఎంసీ ఇండెంట్ పెట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

2.5 టీఎంసీల ఏపీ వాటా విడుదల ..

ఈ నెల 14వ తేదీన ఏపీలోని కర్నూలు జిల్లా అధికారులు 2.5 టీఎంసీల ఇండెంట్ వాటాను విడుదల చేశారు. ఈ నీరు బుధవారం నాటికి ఇంకా ఆనకట్టకు చేరుకోలేదు. గురువారం ఉదయం నాటికి రాజోలిబండ ఆనకట్టకు చేరుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దీంతో ఆర్డీఎస్‌లో ప్రవాహం పెరిగి దిగువన తుంగభద్ర నదిలో కూడా నీరు పారటంతో శుక్ర, శనివారాల్లో తుమ్మిళ్ల లిఫ్ట్ వరకు చేరి డీ-23 నుంచి రైతులకు సాగునీరు అందే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఆ తరువాత మరో 2.5 టీఎంసీలు విడుదల చేయించి పంటకాలానికి సాగునీరు అందించేందుకు తెలంగాణ నాయకత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

కర్ణాటకలో నీటిచౌర్యం కట్టడికి చర్యలు

యాసంగి పంట సాగునీటికి అనేక ఇబ్బందులు పడుతున్న తెలంగాణ రైతులకు పూర్తిస్థాయి సాగునీరు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కర్ణాటకలోని రాజోళిబండ ఆనకట్ట వద్ద నుంచి తెలంగాణలోని సింధనూరు వరకు ఆర్డీఎస్ కాలువకు ఇరువైపుల అనధికారికంగా మోటార్లతో నీటిని వాడుకుంటున్న వారిని కట్టడి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు తెలంగాణ ఆర్డీఎస్ అధికారులు గురువారం నుంచి రాత్రిళ్లు క్షేత్రస్థాయిలోకి వెళ్లి అనధికారికంగా నడుస్తున్న మోటార్లను, కాలువలను బంద్ పెట్టనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. దీనివల్ల ఆర్డీఎస్‌కు సాగునీటి ప్రవాహం పెరిగి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

నీటిని అక్రమంగా వాడుకుంటే చర్యలు



కర్ణాటకలోని రాజోళిబండ ఆనకట్ట నుంచి తెలంగాణ సరిహద్దు వరకు ఆర్డీఎస్ నీటిని అక్రమంగా వాడుకుంటున్న వారిపై చర్యలు తీసుకుంటాం. గురువారం నుంచి మా సిబ్బంది కెనాల్ వెంబడి వెళ్లి రాత్రిళ్లు అన్ని తూములను మూసి, మోటార్లను బంద్ చేయిస్తారు. ఇప్పటికే కర్ణాటక అధికారులతో మాట్లాడి తెలంగాణ రైతులకు వచ్చే సాగునీరు సాఫీగా పారేందుకు సహకరించాలని కోరాం.

- విజయ్‌కుమార్‌రెడ్డి, ఈఈ, ఆర్డీఎస్, (గద్వాల)

నీరు పారుతుందనే నమ్మకం ఉంది..



కర్నూలు వాళ్లు ఇండెంట్ పెట్టకపోతే పంటలు పండవని భయమేసింది. అధికారులు, నాయకుల చొరవతో రెండున్నర టీఎంసీలకు ఆంధ్ర వాళ్లు మంగళవారం ఇండెంట్ పెట్టారని చెబుతున్నారు. ఆనకట్ట వద్దకు వెళ్లి మంగళవారమే చూశాం. రెండు రాష్ట్రాల ఇండెంట్ నీళ్లతో మా పంటలు పండుతాయనే నమ్మకం ఉంది. మూడు ఎకరాల్లో మిరప, మొక్క జొన్న పంట వేశాను. నీళ్ల పారుతాయనే నమ్మకం కలిగింది.

- ఏలియా, రైతు పెద్దతాండ్రపాడు గ్రామం, (రాజోళి)

సమస్యను మంత్రులకు వివరించాం



ఉమ్మడి ఇండెంట్ ద్వారా సాగునీరు అందించక పోతే అలంపూర్ రైతాంగం యాసంగి పంటలు పండవని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ద్వారా మంత్రులకు వివరించాం. ఇరు రాష్ట్రాల ఈఎన్‌సీ అధికారులకు కూడా ఇక్కడి పరిస్థితులు చెప్పాం. వారందరూ సమస్యను అర్థం చేసుకుని ఏపీ వారితో 2.5 టీఎంసీలకు ఇండెంట్ పెట్టించారు. దీంతో సాగునీరు పూర్తిస్థాయిలో అందే అవకాశం ఉంది.

- సీతారామిరెడ్డి, ఆర్డీస్ కమిటీ మాజీ చైర్మన్, తనగల, వడ్డేపల్లి

అక్రమాలకు అందలం

- మహబూబ్‌నగర్ విద్యా శాఖలో నిబంధనలకు తూట్లు
- గత డీఈవో హయాంలో అక్రమంగా డిప్యుటేషన్లు
- తాజాగా అనర్హురాలికి జీసీడీవో పోస్టు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ విద్యా శాఖలో అక్రమాలు రోజుకు ఒకటి వెలుగులోకొస్తున్నాయి. వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. గత డీఈవో హయాంలో అక్రమంగా డిప్యుటేషన్లు ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా పలువురు ఉపాధ్యాయులు పైరవీలు చేసుకుని డబ్బులు ఇచ్చి, తమకు నచ్చిన చోటకు డిప్యుటేషన్ చేయించుకున్నారు. ఈ అక్రమ డిప్యుటేషన్లపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. కనీసం వారిని పాత పాఠశాలలకూ పంపించలేదు. ఈ విషయమై చర్యలు తీసుకొని, వాటిని రద్దు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తేగా.. చూద్దాం.. చేద్దాం అంటూ దాటవేయడంపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయని పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. ఈ విషయంలో పైరవీలు చేసుకోవడంతో పాటు ప్రజా ప్రతినిధులు నుంచి, పైఅధికారుల నుంచి ఒత్తిడి తెస్తున్నారని నాయకులు ఆరోపిస్తున్నారు.

అర్హత లేనివారికి..

సెక్టోరియల్ అధికారిగా నియమించాలంటే సమగ్రశిక్ష అభియాన్ మూడేళ్లకోసారి నిర్వహించే పరీక్షలో అర్హత సాధించాలి. అందులో టాప్ ర్యాంకర్‌కు మొదటి ప్రాధ్యాన్యం ఇస్తారు. వారు ముందుకు రాకుంటే రెండు, మూడు ర్యాంకులు ఉన్న వారిని నియమిస్తారు. కానీ పాలమూరు జిల్లాలో మాత్రం అది అమలు కావడం లేదు. ఓ ఉపాధ్యాయురాలు పరీక్ష రాసి, అర్హత సాధించినా ఆమెకు పోస్టు ఇచ్చేందుకు మక్కువ చూపడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. గత ఏడాది కాలంగా ఆమె జిల్లా విద్యాశాఖ కార్యాలయం చుట్టూ తిరిగినా అప్పటి డీఈవో ఆమె ఫైల్ రాష్ట్ర కార్యాలయానికి పంపించలేదని సమాచారం. గత ఏడాది సెప్టెంబరులో పలు కొర్రీలు పెట్టి పంపడంతో సరిగా లేదని, సరిచేసి మళ్లీ పంపించాలని తిరిగి డీఈవో కార్యాలయానికి పంపించారు. కానీ దానిని మళ్లీ రాష్ట్ర కార్యాలయానికి పంపించ లేదు. దీంతో జీసీడీవో పోస్టు కోసం అర్హత సాధించినా న్యాయం జరుగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. అర్హత లేని ఉపాధ్యాయురాలికి రాష్ట్ర అధికారుల అనుమతి లేకుండానే జీసీడీవో పోస్టింగ్ ఇవ్వడంపై పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎన్.భరత్ తదితరులు కలెక్టర్‌కు, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ అక్రమ డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని కోరినా ఇప్పటి వరకు చర్యలు తీసుకో లేదు.

నిబంధనలకు విరుద్ధంగా కేజీబీవీల పర్యవేక్షణ అధికారి నియామకం

కేజీబీవీల పర్యవేక్షణ అధికారి పోస్టు ఏడాదిన్నర నుంచి ఖాళీగా ఉంది. అప్పటి నుంచి ఇన్‌చార్జీలతోనే నెట్టుకొస్తున్నారు. తాజాగా జనవరి మొదటి వారం లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయురాలికి ని బంధనలకు విరుద్ధంగా అక్రమంగా డిప్యుటేషన్ ఇ స్తూ, కేజీబీవీల పర్యవేక్షురాలిగా జీసీడీవో పోస్టును కట్టబెట్టింది. ఇప్పటికే ఈమెపై పలు ఆరోపణలు ఉన్నాయని విద్యార్థి సంఘాల నాయకులు అంటున్నారు. అర్హత లేని వారికి జీసీడీవో పోస్టు కట్టబెట్టడం సరికాదని అంటున్నారు.

ఆమెను తాత్కాలికంగా తీసుకున్నాం



కేజీబీవీల పర్యవేక్షక అధికారి లేకపోవడంతో తాత్కాలిక ఇన్‌చార్జి జీసీడీవోగా ఉపాధ్యాయురాలు రాధను తీసుకున్నాం. ఆమె రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నుంచి కొత్తవారిని నియమించే వరకు కొనసాగుతుంది. కేజీబీవీల పర్యవేక్షణకు పురుష అధికారులు వెళ్లాలంటే ఇబ్బంది అని ఆమెను తీసుకున్నాం. గతంలో ఉపాధ్యాయులకు ఇచ్చిన డిప్యుటేషన్లు పరిశీలిస్తున్నాం. త్వరలోనే వాటిపై దృష్టి పెడతాం.

ప్రవీణ్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి, మహబూబ్‌నగర్

డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే జీఎంఆర్



డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

భూత్పూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని మద్దిగట్ల గ్రామ శివారులో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేస్తున్న గుత్తేదారులతో మాట్లాడారు. సాధ్యమైనంత వరకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆయన సూచించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లోపం రాకుండా జాగ్రత్త వహించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, నారాయణరెడ్డి, గుత్తేదారు బాబు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడం గొప్ప విషయం

● సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్



చందాపూర్ గ్రామంలో ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం చేస్తున్న పలుస శంకర్ గౌడ్

వనపర్తి రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈ పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడం గొప్ప విషయం అని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. వనపర్తి మండల పరిధిలోని చందాపూర్ గ్రామంలో 2019 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఉద్యోగాలు సాధించిన యువకులకు జిల్లా మాజీ ఉప సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆవుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులకు సన్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గ్రామీణ స్థాయిలో యువతీ యువకులు ఉద్యోగాలు సాధించడం పలువురు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కష్టపడి ఇష్టంతో చదివితే సాధించలేనిది ఏమి లేదని అన్నారు. ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులు గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, గ్రామంలో ఉండే యువతకు మీరు ఆదర్శంగా ఉండాలని అన్నారు. ఇటీవల ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులకు సన్మానం ఏర్పాటు చేయడం చంద్రశేఖర్‌కు అభినందనలు తెలిపా రు. ఉపాధ్యాయ బృందం చంద్రశేఖర్, రాములు, కురుమ న్న తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దాం

- ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

కందనూలు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : భారత స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని యువత కొనసాగించాలని ప్రజా వాగ్గేయకారుడు ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పిలుపునిచ్చారు. దేశిటిక్యాల గ్రామంలో ఈనెల 12,13,14 తేదీల్లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీల ముగింపు సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గోరటి వెంకన్న మాట్లాడుతూ నేటి తరం యువత భారత స్వాతంత్ర్య ఉద్యమ నాయకులు భరత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్, సుభాష్, చంద్రబోస్, చంద్రదేశ్ ఆజాద్‌లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగ అంటేనే పల్లెల్లో క్రీడలు, రంగవల్లులతో రైతులు ఆనందంగా జరుపుకునేది అని, ఇలాంటి క్రీడలను డీవైఎఫ్ఐ యువజన సంఘం నిర్వహించి గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీయడం శుభపరిణామమని కొనియాడారు. ఈ పోటీల్లో మొదటి విజేతగా బీబీఆర్‌ఫౌండేషన్ టీం, రెండవ విజేతగా లింగాల టీం, మూడవ విజేతగా చంద్రకల్ టీంలు గెలిచాయి. మూడవ వార్డు కౌన్సిలర్ అమృతమ్మ, మాజీ సర్పంచ్‌లు కృష్ణారెడ్డి, అచ్చుతారెడ్డి, అమరేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, కేవీపీఎస్ జిల్లా కోశాధికారి గుంపల్లి అశోక్, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శినాగపూర్ మధు, డీవైఎఫ్ఐ నాయకులు అంజనేయులు, చందు, రాజు, కల్యాణ్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

పెద్దకొత్తపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో సంక్రాంతి పండుగ సందర్భంగా రైతు సంబురాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. ఈ పోటీలను కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్‌లు ప్రారంభించారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 15జతల ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రావ తనయుడు శ్రావణ్‌కుమార్ ఎద్దులు 4754.2ఫీట్ల దూరం బండను లాగి మొదటి బహుమతి 50వేల రూపాయలు గెలుచుకున్నారు. గద్వాల జిల్లా మంగంపేట గ్రామానికి చెందిన జయమ్మ ఎద్దులు 4548 ఫీట్ల దూరం బండ లాగి రెండవ బహుమతి 40వేల రూపాయలు గెలుచుకున్నాయి. గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రానికి చెందిన రామకృష్ణ ఎద్దులు 4436.9ఫీట్ల దూరం బండలాగి మూడవ బహుమతి రూ.30వేలు గెలుచుకున్నాయి.

నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం కొండూరు గ్రామం చెందిన నల్లబోతుల లక్ష్మీ, టి.పల్లవిల ఎద్దులు 4359 దూరం బండలాగి నాల్గవ బహుమతి 20వేల రూపాయలు గెలుచుకున్నాయి. కర్నూల్ జిల్లా రెమట్ట గ్రామానికి చెందిన గిడ్డయ్య నాయుడు ఎద్దులు 4250ఫీట్ల దూరం బండలాగి 5వ బహుమతులు రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు కాంగ్రెస్ పార్టీ జూపల్లి అరుణ్‌కుమార్ ఎద్దుల విజేతలకు బహుమతలను అందజేశారు. ఈ పోటీల్లో మాజీ ఎంపీపీలు సూర్యప్రతాప్‌గౌడ్, వి.వెంకటేశ్వర్‌రావు, నాయినోనిపల్లి మైసమ్మ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగపూర్ విష్ణు, మాజీ ఎంపీటీసీ సభ్యుల దండు చంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తగిలి కృష్ణయ్య, నాయకులు గడ్డిగోపుల ఎల్లయ్య, అశోక్‌రెడ్డి, శివశంకర్, బద్రినాయక్, బత్తుల కుర్మయ్య, వెంకటస్వామిగౌడ్, బాలునాయక్ పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లిలో ఎద్దుల బండలాగుడు విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న జూపల్లి అరుణ్‌కుమార్

పెద్దకార్పాములలో ..

మండల పరిధిలోని పెద్దకార్పాముల గ్రామంలో ఫ్రెండ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర యూత్ కేటగిరి విభాగం బండలాగుడు పోటీలు అట్టహాసంగా కొనసాగాయి. పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన పది జతల ఎద్దులు పాల్గొన్నాయి. మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రావు తనయుడు శ్రావణ్‌కుమార్ ఎద్దులు 4160ఫీట్ల దూరం బండలాగి మొదటి బహుమతి రూ.50వేలు గెలుచుకున్నారు. గద్వాల జిల్లాకు చెందిన వీరాంజనేయులు ఎద్దులు 3808.9ఫీట్ల దూరం బండ లాగి రెండవ బహుమతి రూ.40వేలు గెలుచుకున్నారు. కర్నూల్ జిల్లా రెమట్ట గ్రామానికి చెందిన చిన్న గిద్దయ్యనాయక్ ఎద్దులు 3750ఫీట్ల దూరం బండలాగి రూ.30వేలు గెలుచుకున్నాయి. గద్వాల జిల్లా అయిజ మండలానికి చెందిన రామకృష్ణారెడ్డి ఎద్దులు 3628ఫీట్ల దూరం బండ లాగి నాల్గవ బహుమతి రూ.20వేలు గెలుచుకున్నాయి.

ముగిసిన చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

మిడ్జిల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని వెలుగొమ్ముల గ్రామంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఆలయంలోని తెల్లవారుజాము నుంచి పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు, ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. చక్రతీర్థస్నానంలో భాగంగా స్వామివారిని పల్లకిలో గ్రామంలోని భజనలు, బ్యాండుమేళాలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్థులు పల్లకిలో వస్తున్న చెన్నకేశవస్వామికి మంగళహారతులతో స్వాగతం పలికారు. చిన్నారులు వేసిన కోలాటం పలువురిని ఆకట్టుకుంది. ఆలయానికి విరాళాలు ఇచ్చిన పలువురి దాతలను ఆలయకమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ గౌరమ్మశ్రీను, కమిటీ సభ్యులు దేవేందర్, మాసయ్య, వెంకటయ్య, సాయన్న తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మిడ్జిల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తిమ్మాజిపేట గ్రామం చేగుంట గ్రామానికి చెందిన గడ్డం చెన్నయ్య (45) జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు బుధవారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మండలంలోని దోనూర్‌లో చెన్నయ్య ఆవుల కాపరిగా కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. ఈనెల 11న ఆర్థిక ఇబ్బందులతో గడ్డిమందు తాగగా, మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



గంగాపురం చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల/మిడ్జిల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మండలం గంగాపురం చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి విడుదల చేశారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల ఆరో తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనుండగా వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు.

ఆలయ ఈవో దీప్తిరెడ్డి, అర్చకులు కేశవాచారి, ఆలయ ట్రస్టీ సభ్యులు జనార్దన్‌రెడ్డి, గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు. అంతకుముందు మిడ్జిల్ మండలం వెలుగొమ్ముల లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలోని స్వామి వారిని ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ కమిటీ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు.

స్పోర్ట్స్ బాక్స్

చెన్నై బయలుదేరిన పీయూ క్రికెట్ జట్టు



క్రికెట్ జట్టు క్రీడాకారులతో యూనివర్సిటీ అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ పీయూ క్రికెట్ పురుషుల జట్టు ఆలిండియా సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు బుధవారం చెన్నైకి బయలు దేరింది. అక్కడి మద్రాస్ యూనివర్సిటీలో ఈ నెల 16 నుంచి 21 వరకు నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నది. ఈ సందర్భంగా యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బషీర్ అహ్మద్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ అర్జున్‌కుమార్ మాట్లాడారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి యూనివర్సిటీకి విజయం అందించాలని కోరారు. అనంతరం క్రీడాకారులకు ట్రాక్‌సూట్, టీమ్ యూనిఫామ్ అందించారు. కార్యక్రమంలో పీడీ డాక్టర్ శ్రీనివాసులు, క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సురేశ్, వెంకట్‌రెడ్డి, కోచ్‌లు అబ్దుల్లా, అమిద్, టీం మేనేజర్ మన్యం పాల్గొన్నారు.

గ్రామాల్లో జాతీయ స్థాయి క్రీడాకారులు

» స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి



క్రీడాకారులతో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

అలంపూరు చౌరస్తా, జనవరి 15, (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి పోటీల్లో ఆడగల సత్తా గ్రామీణ క్రీడాకారుల్లోనే ఉందని స్పోర్ట్స్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూరు మండలంలోని క్యాతూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామీణ స్థాయి క్రీడాపోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం క్రీడాకారులను విస్మరించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం కప్ నిర్వహిస్తూ గ్రామీణ క్రీడకారుల్లో ప్రతిభను వెలికి తీస్తోందన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. నగదు బహుమతులను క్యాతూరు పీఏసీఎస్ చైర్మన్ పీవీ రాఘవరెడ్డి, రాజు, చిన్నముని, వేణుగోపాల్, జ్ఞాపికలను జ్ఞాపికలను డి. శ్రీనివాసులు, పరశురాం అందించారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

» ఆటో, కారు ఢీకొని ఇద్దరు - స్కూటీ, సుమో ఢీకొని ఒకరు

కల్వకుర్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలో ఈ సంఘటనలు జరిగాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కల్వకుర్తి మండలం తోటపల్లి గ్రామానికి చెందిన మహేష్ (34) ఆటోలో జోగు బంగారయ్య(35), శ్రీపతి, నాగమ్మలు కల్వకుర్తి నుంచి గ్రామానికి బయలుదేరారు. తర్నికల్ సమీపంలో ప్రధాన రహదారిపై వారు వస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్నది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ మహేశ్ (34), జోగు బంగారయ్య (35) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన శ్రీపతి, నాగమ్మలను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీపతి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. బంగారయ్యకు భార్య, కూతురు, మహేష్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని మృత దేహాలను అక్కడి నుంచి తరలించకుండా తర్నికల్ సమీపంలోని ప్రధాన రహదారిపై బంధువులు ధర్నా చేశారు. సంఘటన స్థలానికి కల్వకుర్తి సీఐ నాగార్జున చేరుకొని వారికి నచ్చచెప్పారు. అనంతరం మృతదేహాలను కల్వ కుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే కల్వకుర్తి పట్టణంలోని తిలక్ నగర్‌కు చెందిన చంద్రయ్య స్కూటీపై వస్తుండగా, హైదరాబాద్ చౌరస్తాలో జడ్చర్ల వైపు నుంచి వస్తున్న టాటాసుమో ఢీకొన్నది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చంద్రయ్యను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాఘవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

గద్వాల క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఆశోక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. జోగుళాంబ గద్వాల - శ్రీరాంనగర్ రైల్వే స్టేషన్ల మధ్య 177/13-14 కిలోమీటర్ వద్ద సోమవారం రాత్రి రైలు పట్టాల వెంట నడుస్తూ వెళ్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి (40)ని రైలు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఎవరికైనా వివరాలు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

కోడి పందెం స్థావరాలపై పోలీసుల దాడి

నాగర్‌కర్నూల్ క్రైం/ కృష్ణ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్, నారాయణ పేట జిల్లాల్లో కోడి పందేల శిబిరాలపై పోలీసులు దాడి చేశారు. 13 మందిని అరెస్ట్ చేసి, నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నాగర్‌కర్నూల్ మండల పరిధిలో, పెద్దముద్దునూర్ గ్రామంలోని కోట మైసమ్మ వద్ద మంగళవారం కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. నాలుగు కోళ్లను, తొమ్మిది సెల్‌ఫోన్లు, రూ. 17,580ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాగర్‌కర్నూల్ ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. నారాయణపేట జిల్లా, కృష్ణా మండల పరిధిలోని హిందూపూర్ శివారులో, వాసునగర్ వద్ద కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ నవీద్, సిబ్బందితో కలిసి దాడులు చేశారు. నలుగురిని అరెస్ట్ చేశారు. రెండు కోళ్లు, రూ. 3,800ను స్వాధీనం చసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కృష్ణా ఎస్ఐ తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

» 12 మందిపై కేసు నమోదు

గద్వాల క్రైం/ మానవపాడు జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు చోట్ల పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేసి 12 మందిని అరెస్ట్ చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రంలోని దౌదర్‌పల్లి సమీపంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దౌదర్ పల్లి శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పట్టణ ఎస్ఐ కల్యాణ్ కుమార్, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 59,390, ఏడు సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే మానవపాడు మండల పరిధిలోని చెన్నిపాడులో బుధవారం పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ చంద్రకాంత్ ఆధ్వర్యంలో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు పారిపోయారు. వారి దగ్గర నుంచి రూ.5600 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పారిపోయిన వారిని గుర్తించి అరెస్ట్ చేస్తామని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు.



స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన ఎస్‌వీకే కేబీ ఆదిత్య లక్ష్మారావు, తరలివచ్చిన భక్తులు

వైభవంగా కల్యాణోత్సవం

» ప్రారంభమైన సింగోటం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

కొల్లాపూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా కొనసాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఫౌండర్, ట్రస్టు చైర్మన్ ఎస్‌వీకే కేబీ ఆదిత్య లక్ష్మారావు కల్యాణోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నెల 16న రాత్రి నేడు గంటలకు ప్రభోత్సవం, 17న సాయంత్రం నాలుగు గంటలకు లక్ష్మీ నరసింహ స్వామి షిడే మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 18న రాత్రి ఎనిమిది గంటలకు తెప్పోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు దేవాదాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో వసతులు కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు టి.సాయికృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

మల్లయ్య స్వామికి కోటి దండాలు

» కర్ణాటక రాష్ట్రం, మైలాపూర్ కొండల్లో మారుమోగిన శివనామస్మరణ » జాతరకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు

» భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ » బండారు ఉత్సవంతో పసుపు మయమైన క్షేత్రం

నారాయణపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా సరిహద్దులో, కర్ణాటక రాష్ట్రంలోని మైలాపూర్ మల్లయ్య జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన గొలుసు, పల్లకీసేవ, మల్లయ్య స్వామి గంగాస్నానం తదితర ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'శివాయేశ్ కోటిగేశ్ కోటిగే' అంటూ భక్తుల శివనామ స్మరణతో మైలాపూర్ కొండలు మారుమోగాయి. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య ఎత్తైన కొండ గుహలో వెలసిన మల్లయ్య దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. చక్రస్నానం కోసం మల్లయ్య స్వామిని పల్లకిలో ఉంచి, అశ్వవాహనం ముందు కదులుతుండగా, మేళ, తాళాల మధ్య ఊరేగింపుగా చెరువు వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు అశ్వవాహనంపై బండారు చల్లుతూ ముందుకు సాగారు. దీంతో కొండ చుట్టూ ఉన్న ప్రాంతమంతా పసుపుమయంగా మారింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు బండారు మహోత్సవం కొనసాగింది. రైతులు జొన్నకంకులు, చెరకు గడలతో ఊరేగింపులో పాల్గొన్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఆర్టీసీ డిపోల నుంచి మైలాపురానికి ప్రత్యేక బస్సులు నడిపారు. గతంలో ఊరేగింపు సందర్భంగా భక్తులు స్వామివారిపైకి గొర్రె పిల్లలను విసిరేసి మొక్కులు తీర్చుకునే వారు. ఈ ఆచారానికి ఎనిమిదేళ్ల క్రితం అప్పటి కర్ణాటక ప్రభుత్వం బ్రేక్ వేసింది.



స్వామి వారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు, ఊరేగింపులో అశ్వవాహనం



కుంభం వద్ద పూజలు చేస్తున్న స్వాములు

మాణికేశ్వరీ మాతకు ప్రత్యేక పూజలు

» వైభవంగా సంక్రాంతి వేడుకలు

దామరగిద్ద, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా సరిహద్దులో, కర్ణాటక రాష్ట్రంలోని గుల్బార్గా జిల్లా, సేడం తాలూకా, యానగుంది లోని మాణిక్యగిరి క్షేత్రంలో మంగళవారం మకర సంక్రాంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ట్రస్టు కార్యదర్శి శివయ్యస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. షాపూర్, శ్రీశైలం, కరీంనగర్, నల్గొండ, మహబూబ్‌నగర్, నారాయణపేట, సిరిపూర్ తదితర ప్రాంతాల్లోని ఆశ్రమాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాణికేశ్వరీ మాత చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి, కుంభం పోశారు. కార్యక్రమంలో దర్శన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే బస్వరాజ్ పటేల్, మాణిక్యగిరి ట్రస్టు సభ్యులు మందార్, బండి శివరాంరెడ్డి, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

నరసింహ స్వామీ నమోస్తుతే

» సంగినేనిపల్లిలో వైభవంగా ఉత్సవాలు

» ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లలో తరలివచ్చిన రైతులు



ఉత్సవాలకు తరలివస్తున్న భక్తులు

వీపనగండ్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండల పరిధిలోని సంగినేనిపల్లి వద్దనున్న గుహలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి, లక్ష్మీనరసింహస్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల రైతులు అలంకరించిన ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లపై ర్యాలీగా తరలివచ్చారు. కొత్త ధాన్యాలతో నైవేద్యం సమర్పించి, స్వామివారికి సమర్పించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన కోలాటం ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దర్శించుకున్నారు. అలాగే మంత్రి జూపల్లి తనయుడు జూపల్లి అరుణ్, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాస్ స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. సంగినేనిపల్లి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

అన్నింట్లో అలంపూరు వెనుకబాటు

» ఇబ్బందుల్లో ఉన్న ఆర్డీఎస్ రైతాంగం » పార్లమెంట్ మాజీ సభ్యుడు సురవరం సుధాకర్‌రెడ్డి

అలంపూరు చౌరస్తా, జనవరి 15, (ఆంధ్రజ్యోతి) : అలంపూరు నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుక బడిందని పార్లమెంట్ మాజీ సభ్యుడు సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని అయన స్వగ్రామం కంచుపాడులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చౌరస్తాలో రూ.27 కోట్ల ప్రజాధనంతో నిర్మించిన వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయినా వాడుకోలేని దుస్థితిలో ఉన్నామన్నారు. దీంతో అనారోగ్యంతో ఉన్నా, ప్రమాదాల బారిన పడినా కర్నూలులోని ఆసుపత్రులను ఆశ్రయిం చాల్సి వస్తోందన్నారు. కానీ అక్కడ ఆరోగ్యశ్రీ చెల్లనం దున ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్డీఎస్ సాగునీటిపై లక్షలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని, కానీ కాలువల్లో కంప చెట్లు పెరిగి, తూముల షట్టర్లు పగిలిపోయి చివరి ఆయకట్టుకు నీరందని దుస్థితి నెలకొన్నదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న బస్సు సర్వీసులను రద్దు చేయడంతో నియోజకవర్గంలో చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం కరువైందని తెలిపారు. కంచుపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏడు తరగతులు ఉన్నాయని, కానీ గదుల కొరత ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడ్తున్నారన్నారు. హైదరాబాదులోని నిజాం ఆసుపత్రిని అభివృద్ధి చేసి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్నారు. రైతు భరోసాపై విధి విధానాలను రైతులకు వివరించాలని డిమాండ్ చేశారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ఉండవల్లి మండల పరిధిలోని కంచుపాడులో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన యువజనోత్సవాలకు సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజర య్యారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ రామకిషన్, మాజీ సర్పంచు శేషన్‌గౌడు, నాయకులు ఆనంద్, పెద్దబాబు, వీరాంజనేయులు, నాగార్జున, శివ, వెంకటేశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి, కంచుపాడు, ఇటిక్యాల పాడు మాజీ సర్పంచులు శేషన్‌గౌడు, సురవరం లోకేశ్వరరెడ్డి,

పాము కాటుతో అత్తాకోడళ్ల మృతి

» వారం వ్యవధిలో ఒకే స్థలంలో సంఘటనలు

వీపనగండ్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల పరిధిలోని వల్లభాపురం గ్రామంలో వారం రోజుల వ్యవధిలో పాము కాటుకు గురై అత్తాకోడళ్ల మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సంగనమోని తెలుగు చంద్రమ్మ అలియాస్ ఎల్లమ్మ (52) ఈ నెల 12న భోగి పండుగ రోజు ఇంటి ముందున్న అరుగులపై పడుకున్నది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఎడమ కాలిపై నొప్పి అనిపించడంతో చూసుకోగా పాము కాట్లు కన్పించాయి. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలుపడంతో ఆమెను వీపనగండ్ల ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వనపర్తి ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. సంఘటనా స్థలంలో వెతకగా నాగుపాము కనిపించడంతో చంపేశారు. మృతురాలికి భర్త నరసింహ, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే చంద్రమ్మకు పాము కాటు వేసిన అరుగు పైనే ఈ నెల ఆరున మధ్యాహ్నం ఆమె పెద్ద అత్త కిష్టమ్మ (75) పడుకొని ఉండగా, ఎడమ చేతిపై పాము కాటేసింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది.

వారం రోజుల వ్యవధిలోనే అత్త కోడళ్ల ఒకే స్థలంలో పాము కాటుతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు జూపల్లి అరుణ్ బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. అండగా ఉంటామని హామీ ఇచ్చి, ఆర్థిక సహాయం అందించారు.

గోపాల్‌పేట పంప్ హౌస్ పరిశీలన

వనపర్తి అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలోని గోపాల్‌పేట పంప్ హౌస్‌ను మంగళవారం ఎమ్మెల్యే మేఘారెడ్డి పరిశీలించారు. పంప్‌హౌస్‌లోని మోటార్లలో ఒకటి పని చేయడం లేదు. అక్కడ అదనపు మోటార్ లేకపోయినా ఉన్నట్లు అధికారులు చూపిస్తున్నారంటూ మండల నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై పంప్‌హౌస్ సిబ్బందితో ఎమ్మెల్యే మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వెంటనే అదనపు మోటార్‌ను ఏర్పాటు చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు.



మోటార్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

చేపల వేటకు వెళ్లి ఇద్దరి మృతి

» నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో సంఘటనలు

బిజినేపల్లి/ దామరగిద్ద, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని మృతి చెందారు. నాగర్‌కర్నూల్, నారాయణ పేట జిల్లాల్లో ఈ సంఘటనలు జరిగాయి. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని గంగారం గ్రామానికి చెందిన దూదేకుల మాబు (60) అనే వ్యక్తి మంగళవారం ఉదయం చేపల వేట కోసం గ్రామ శివారులోని కుంటకు వెళ్లాడు. చేపలు పట్టేందుకు నీటిలో దిగిన మాబు కాళ్లకు వల చుట్టుకోవడంతో నీట మునిగి మృతి చెందాడు. అతడికి భార్య, ఆరుగురు పిల్లలు ఉన్నారు. అంత్యక్రియలు కూడా నిర్వహించలేని స్థితిలో ఉన్న అతడి కుటుంబానికి మాజీ సర్పంచ్ శేఖర్ రెడ్డి ఆర్థిక సాయం అందించారు. నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కడ్తాల పాండు(38) సోమవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో చేపల వేట కోసం గ్రామ సమీపంలోని చెరువుకు వెళ్లాడు. నీటిలో దిగి చేపలు పడ్తుండగా ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. గమనించిన గ్రామస్థులు భార్య లక్ష్మికి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మంగళవారం ఉదయం చెరువు వద్దకు చేరుకొని, గజ ఈతగాళ్ల సహాయంతో అతడి మృతదేహాన్ని బయటకు తీశారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



దూదేకుల మాబు, పాండు (ఫైల్)

న్యూస్ బాక్స్

సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



సాతర్లలో భూమి పరిశీలిస్తున్న అధికారులు

ఇటిక్యాల జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి కుసుమ్ పథకంలో భాగంగా బుధవారం ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వ భూమిని పరిశీలించారు. సబ్‌స్టేషన్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ, దేవాదాయ భూములను పరిశీలించినట్లు తహసీల్దార్ బి.నరెందర్ తెలిపారు. సాతర్ల గ్రామంలో సబ్‌స్టేషన్‌కు సమీపంలో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమి, పెద్దదిన్నె శివారులోని దేవాదాయ భూమి తొమ్మిది ఎకరాలను పరిశీలించామన్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ శేఖర్, ఏపీఎం కుర్మన్న, ఆర్ఐ భీంసేనరావు, సర్వేయర్ పాల్గొన్నారు.

ఘనంగా శివాంజనేయ స్వామి రథోత్సవం



శివాంజనేయస్వామి రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

ఇటిక్యాల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏటా మండల పరిధిలోని వావిలాల గ్రామంలో శివాంజనేయస్వామి జాతర ఉత్సవాలు నిర్వహిస్తారు. మంగళవారం రాత్రి స్వామివారి రథోత్సవం కన్నుల పండుగా సాగింది. వేలాదిమంది భక్తులు తిలకించారు. బుధవారం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే మండలంలో ఆయాగ్రామాల్లో ప్రత్యేక పూజలు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

పాస్టర్ల ప్రార్థనలతో యువకులలో మార్పు

- యవ్వనస్తుల కార్యక్రమంలో ఎమ్మెల్యే

గద్వాల, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఆదివారం చర్చిలలో పాస్టర్లు నిర్వహించే ప్రార్థన కార్యక్రమాలు వారి సూక్తులు యువకులలో ప్రభావం చూపాయని, చెడుమార్గాలకు దూరంగా ఉంటూ వారి ఉజ్వల భవిష్యత్తుకు మార్గం వేసుకుంటున్నారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన యవ్వనస్తుల కూడిక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర ప్రాంతాల నుంచి పాస్టర్లు వచ్చి ఇక్కడి యువత మార్పు కోసం ప్రార్థనలు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కుర్వ హనుమంతు, రాజశేఖర్, ఉరుకుందు, కురుమన్న ఉన్నారు.

బియ్యం పట్టివేత

అలంపూరుచౌరస్తా, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండల పరిధిలోని బొంకూరు శివారులో రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఏఎస్సై సుబ్బారెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మంగళవారం ఉదయం షాదర్‌పాష, రమేష్‌లో బ్లూకోట్ విధుల్లో ఉండగా మానవపాడు మండలం, పోతులపాడు స్టేజీ సమీపంలో ఓ ఆటోను తనిఖీ చేయగా అందులో నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించాయి. మానవపాడు మండలం కొర్విపాడు గ్రామానికి చెందిన బడేసాబ్, లక్ష్మన్న ఆదేశాల మేరకు గ్రామాల్లో సేకరించి కర్నూలుకు తరలిస్తున్నట్లు డ్రైవర్ నాగన్న విచారణలో తెలిపాడు. ఈ మేరకు ఆటోను స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళకు బహుమతి అందజేస్తున్న డాక్టర్ హరితసోమనాద్రి

ఎర్రవల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎర్రవల్లి మండల పరిధిలోని జింకలపల్లిలో మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని పోతురాజు శంకరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు 30మందికిపైగా మహిళలు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ పోతురాజు హరిత, సోమనాద్రి హాజరై ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేల బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు లలితమ్మ, మాజీ సర్పంచు ఈదన్న, నాగరాజు, భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

ఈనెల 26 తర్వాత ఇళ్ల మంజూరు

- నెరవేరనున్న పేదల సొంతింటి కల
- మోడల్ ఇంటి నిర్మాణ పూజలో ఎమ్మెల్యే బండ్ల



గద్వాలలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల

గద్వాల/ధరూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నెరవేరబోతున్నదని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గణతంత్ర్య దినోత్సవం తర్వాత పేదలకు మంజూరు చేసిన ఇళ్ల జాబితాను విడుదల చేస్తామని, ఇల్లు నిర్మించుకునే వారికి రూ.5లక్షల ఇస్తామని చెప్పారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే ధరూరు ఎంపీడీవో కార్యాలయం సమీపంలోనూ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లు పరిమితంగా నిర్మించినా అవి పూర్తిగా కేటాయించలేకపోయామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు ఇవ్వడంతో పాటు ఇల్లు లేనివారికి మంజూరు చేయాలని తలచామన్నారు. నియోజకవర్గానికి 3500 ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. సొంత జాగా ఉంటే చాలని, డబుల్ బెడ్రూమ్, హాల్, కిచెన్‌తో పాటు మరుగుదొడ్డి నిర్మించుకోవచ్చని తెలిపారు. ఇప్పటికే లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన పూర్తి అయ్యిందని, ఇందులో ఇందిరమ్మ కమిటీల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి మంజూరు చేస్తామని తెలిపారు. ఇళ్లు లేని ప్రతీ ఒక్కరికి ఈ పథకం వర్తింపజేస్తామన్నారు. కాగా అధికారులు మోడల్ ఇంటి నిర్మాణ మ్యాప్‌ను చూపించి ఎంత ధరలో ఇంటిని ఏవిధంగా నిర్మించవచ్చో ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు సుబాన్ మాజీ ఎంపీపీ ఆల్వాల్ ప్రతాప్‌గౌడ్, శ్రీధర్ గౌడ్, జములమ్మ ఆలయ చైర్మన్ వెంకట్రాములు, డైరెక్టర్ మంగలి వీరేష్ పాల్గొన్నారు. అలాగే ధరూరు కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు పద్మవెంకటేశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఉరుకుందు, డీఆర్ విజయ్, ఎంపీడీవో, కార్యకర్తలు ఉన్నారు.

ఇంటింటా సంక్రాంతి సంబురం

- రంగురంగుల ముగ్గులతో ఇళ్ల ముంగిళ్లను అలంకరించిన మహిళలు
- సంక్రాంతి కళను సంతరించుకున్న గ్రామాలు



వడ్డేపల్లి మండలం కొంకలలో ఇంటిముందు ముగ్గు వేస్తున్న యువతి



గద్వాల పట్టణంలో ఇంటిముందు ముగ్గు వేసి రంగులద్దుతున్న యువతి



గద్వాలలో ఓ మహిళ వేసిన రైతుముగ్గు

- ఆయా గ్రామాల్లో ఆలయాల చుట్టూ బండ్ల ఊరేగింపు

గద్వాల/వడ్డేపల్లి/అలంపూరుచౌరస్తా, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ కేంద్రమైన వడ్డేపల్లితో పాటు పాలు గ్రామాల్లో మూడు రోజుల సంక్రాంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు వేకువఝామున లేచి తలస్నానాలు చేసి ఇళ్ల ముందు వివిధ రకాల రంగులతో వివిధ ఆకృతులతో రంగురంగుల ముగ్గులు వేసి వాటిపై గొబ్బెమ్మలు ఉంచి పూలతో అందంగా అలంకరించారు. ఆ తర్వాత మహిళలు, చిన్నారులు వాటి చుట్టూ చేరి పాటలు పాడుకుంటూ వేడుకలు చేసుకున్నారు. అనంతరం మహిళలు ఆలయాలకు వెళ్లి అభిషేకాలు, పూజలు చేశారు. పండుగను సందర్భంగా వివిధ రకాల పిండి వంటలు చేసుకుని బంధువులతో కలిసి విందు ఆరగించి పండుగను ఉత్సాహభరితంగా జరుపుకున్నారు.

● ఆలోచింపజేసిన ముగ్గు

గద్వాల: సంక్రాంతి పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు. మంగళ, బుధవారాలలో మకర సంక్రాంతి, కనుమను ఘనంగా జరుపుకున్నారు. మకర సంక్రాంతి రోజు గద్వాలలో మహిళలు వేసిన రంగవల్లులు ఆలోచింపజేశాయి. గద్వాల జరీ చీరను ముగ్గులో రంగులతో పద్మావతి, లక్ష్మీజ్యోతి, మాధవి అలంకరించారు. అలాగే మరో మహిళ.. వ్యవసాయం నిలవాలి.. రైతు గెలవాలి అంటూ భుజంపై నాగలితో ఉన్న రైతు ముగ్గును వేశారు.

● మహిళలు వంటింటికే పరిమితం కావొద్దు

అలంపూరు చౌరస్తా: మహిళలు అన్నిరంగాల్లో ఎదిగినప్పుడే ఇంటితో పాటు దేశం బాగుంటుందని ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద అన్నారు. బుధవారం ఉండవల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఆమె హాజరయ్యారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్నిరంగాల్లో రాణిస్తూ కుటుంబానికి అండగా ఉండాలన్నారు. మహిళలకు అన్యాయం జరిగినప్పుడు కలిసికట్టుగా గళం ఎత్తాలని పిలుపునిచ్చారు. ముగ్గుల పోటీల్లో మొదటి స్థానంలో మౌనిక, రెండవ స్థానంలో సాక్షి, మూడో స్థానంలో మేఘన, నాల్గవ స్థానంలో స్వీటి, ఐదవ స్థానంలో ఉమ నిలిచారు. వారికి నర్మద ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఏమేలమ్మ, కమిటీ సభ్యులు సుజాత, సమీరా, సీపీఎం నాయకులు సింగరాజు, మద్దిలేటి, ఈదన్న, వెంకటేశ్వర్లు, ఆలీ, ఆక్బర్ తదితరులు ఉన్నారు.



శాంతినగర్‌లో చిన్నారులకు రేగిపళ్లు పోస్తున్న కుటుంబ సభ్యులు



ఉండవల్లిలో ముగ్గుల పోటీ విజేతకు బహుమతి ఇస్తున్న ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద

గెలుపు, ఓటమిని సమానంగా స్వీకరించాలి

- ● మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్
- ● విజేతగా కబీర్‌దాస్ శివశంకర్ జట్టు
- ● రన్నర్స్‌గా జీకే టీం



విజేత జట్టుకు షీల్డ్‌ను అందజేస్తున్న గద్వాల మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్

గద్వాల అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో క్రీడాకారులు గెలుపు,ఓటములను సమానంగా స్వీకరించాలని మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. బుధవారం స్థానిక తెలుగుపేటలో కౌన్సిలర్ అనిత డీటీడీసీ నరసింహులు ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహించిన ప్రీమియర్ లీగ్ సీజన్-2 క్రికెట్ పోటీలు ముగింపు కార్యక్రమానికి మునిసిపల్ చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వాన్ని కలగజేస్తాయన్నారు. ప్రతి యేటా కౌన్సిలర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఈ ఏడాది కూడా నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. యువత క్రీడల్లో రాణిస్తే మంచి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కావున ప్రతీ ఒక్కరు ఏదైనా ఒక క్రీడను ఎంచుకుని రాణిస్తే ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయన్నారు. అనంతరం విన్నర్స్ జట్టు కబీర్‌దాస్ శివశంకర్ టీంకు యువజన కాంగ్రెస్ గద్వాల జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ రూ.25వేల నగదు బహుమతి, షీల్డ్‌ను అందజేశారు. రన్నర్స్ జట్టు జీకే టీం రూ.15వేల నగదు, షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ గద్వాల జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్, మాజీ మునిసిపల్ చైర్మన్ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లారెడ్డి, కోటేష్, క్రీడాకారులు ఉన్నారు.

సంస్కృతికి నిదర్శనం రంగవల్లులు



కిష్టాపురంలో ముగ్గుల విజేతకు నగదు బహుమతి ఇస్తున్న భగత్‌సింగ్ యూత్ సభ్యులు

అయిజటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సంస్కృతిని ముగ్గులు తెలియజేస్తాయని యూత్ సంఘాల సభ్యులు అన్నారు. మండల పరిధిలోని కిష్టాపురం గ్రామంలో శివాజీ ఛత్రపతి యూత్, అయిజ పట్టణంలో స్వామి వివేకానంద యూత్ సభ్యులు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆధునిక పోకడలకు అలవాటు పడుతూ నేటి యువతీ, యువకులు సంప్రదాయంగా వస్తున్న రంగవల్లులను మరిచిపోతుండటం బాధాకరమని అన్నారు. అందువల్లే తాము ఈ పోటీలు నిర్వహించి మహిళలను ప్రోత్సహిస్తున్నామని అన్నారు.

కిష్టాపురంలో మొదటి బహుమతి గెలిచిన దివ్యకు రూ.2016, రెండో బహుమతి భవాని రూ.1,516, మూడో బహుమతి మహేశ్వరి రూ.1,016, నాలుగో బహుమతి ఉమేశ్వరికి రూ.516 నగదును భగత్‌సింగ్ యూత్ సభ్యులు అందజేశారు. అయిజలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న 38 మంది మహిళలకు ప్రోత్సాహకంగా స్వామి వివేకానంద యూత్ సభ్యులు టీ గ్లాసులను అందజేశారు.

ఘనంగా సందెరాళ్ల పోటీలు



సందెరాళ్ల పోటీల విజేతలతో నిర్వాహకులు, దాతలు

- ● యువకులను ప్రోత్సహించడం అభినందనీయం
- ● కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు

ధరూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పండుగలు, జాతరలు, దేవరల సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో వివిధ రకాల క్రీడా పోటీలను ఏర్పాటు చేయడంతో పాటు యువకులను ప్రోత్సహించడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు పటేల్ శ్రీనివాసులు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పార్టీ నాయకులు ఆంజనేయులు, సందెరాళ్ల యూత్ ఆధ్వర్యంలో మంగళవారం ధరూరు మండల కేంద్రంలో సందెరాళ్ల పోటీలు నిర్వహించారు. పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరై పటేల్ శ్రీనివాసులు మాట్లాడుతూ సందెరాళ్ల పోటీలను రాష్ట్ర ప్రభుత్వం జాతీయ క్రీడగా గుర్తింపు ఇచ్చి గ్రామీణ ప్రాంత యువకులను ప్రోత్సహించాలన్నారు. పోటీల్లో మొదటి విజేతకు పటేల్ శ్రీనివాసులు, రెండో బహుమతిని పెద్ద కిష్టన్న, మూడవ బహుమతిని అడవి ఆంజనేయులు, నాల్గవ బహుమతి రంగస్వామి అందజేశారు. బీరప్ప ఆలయం వద్ద స్వామివారికి మొక్కు చెల్లించి, అన్నదాన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు, వివిధ గ్రామాల యువకులు ఉన్నారు.

బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యం



గద్వాల అంబేడ్కర్ సర్కిల్ వద్ద మాట్లాడుతున్న రాంబాబు

● బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

గద్వాల టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలైన బహుజనులకు రాజ్యాధికారం సాధించడమే బహుజన సమాజ్ పార్టీ అంతిమ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకేపోగు రాంబాబు అన్నారు. మూడు దశాబ్దాల క్రితం దివంగత కాన్షీరామ్ నేతృత్వంలో ఉత్తరప్రదేశ్‌లో ప్రారంభమైన బహుజనవాద ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించడం మారుతున్న సామాజిక పరిస్థితులకు నిదర్శనమన్నారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జనకల్యాణ్ దివస్ సందర్భంగా బుధవారం పట్టణంలో బీఎస్పీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్ సర్కిల్ వద్ద ప్రారంభమైన బైక్ ర్యాలీ పట్టణంలోని ప్రధాన రహదారుల్లో సాగింది. ఈ సందర్భంగా భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన రాంబాబు, రాజ్యాంగం ద్వారా దక్కిన ఓటు హక్కు ద్వారానే రాజ్యాధికారం సాధ్యమన్నారు.

యూపీ మాజీ సీఎం మాయవతి నేతృత్వంలో బీఎస్పీ జనచైతన్యం కోసం నిరంతర కృషి సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు మణికుమార్, రేపల్లె రాజు, వెంకటేష్‌నాయక్, సవారన్న, కొళ్ల మోహన్‌రాజు, నరేష్ కుమార్, లక్ష్మన్న భాస్కర్, నాగరాజు, ఉపేందర్, దేవన్న, శాంతిరాజు ఉన్నారు.

అన్నిరంగాల్లో యువతను ప్రోత్సహించాలి



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న దాతలు

వడ్డేపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా బుధవారం వడ్డేపల్లి మునిసిపాలిటీ పరిధిలోని పైపాడు గ్రామంలోని కొత్తకొట్టాలలో అండర్-16 బాలుర కబడ్డీ పోటీలు నిర్వహించారు. టోర్నమెంట్‌లో పది జట్టు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.1,300తో పాటు షీల్డ్‌ను దాత ఈడిగ శేఖర్, వడ్డే వెంకటేష్, బోయ శ్రీను అందజేశారు. రెండవ బహుమతిగా రూ.1000లు, షీల్డ్‌ను దాత బోయ వెంకటేశ్వర్లు, మూడవ బహుమతి రూ.800లు, షీల్డ్‌ను దాత వెంకటేష్ అందజేశారు.

కాగా టోర్నమెంట్‌లో పాల్గొన్న టీంలతో పాటు నిర్వాహకులకు తిమ్మప్ప భోజన వసతి కల్పించారు.

అనంతరం దాతలు మాట్లాడుతూ గ్రామీణ యువతను అన్నిరంగాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు.

విలీన సభను విజయవంతం చేయాలి

● ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కార్తీక్

గద్వాల టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బలమైన కార్మిక ఉద్యమ నిర్మాణమే లక్ష్యంగా ఈ నెల 18న కొత్తగూడెంలో తలపెట్టిన ఐఎఫ్‌టీయూ విలీన సభను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ కోరారు. ఐఎఫ్‌టీయూకు చెందిన రెండువర్గాలు ఒకే యూనియన్‌గా కలిసి పని చేయడం ద్వారా కార్మిక ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. విలీన సభ పోస్టర్‌ను బుధవారం పట్టణంలోని యూనియన్ కార్యాలయం వద్ద విడుదల చేశారు. అనంతరం మాట్లాడిన సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి దానయ్య, ఏళ్ల తరబడి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను పునరుద్ధరించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకునే వరకు పోరాడతామన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు, ఆటో, మోటారు, భవన నిర్మాణ ఇతర అనుబంధ రంగాల, హమాలీ కార్మికులు రావాలని కార్తీక్ కోరారు. కార్యక్రమంలో కోళ్ల అంజి, రాజ్, సూరి, కురుమన్న, సుదర్శన్ ఉన్నారు.

లోవోల్టేజీతో కాలిపోయిన ఎలక్ట్రిక్ వస్తువులు

మానవపాడు, జనవరి 15, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాగులకుంటవీధిలో మంగళవారం రాత్రి విద్యుత్ లోవోల్టేజీ సమస్యతో గౌండఖాజ, పింజారి రఫీ మరికొందరి ఇళ్లలోని టీవీలు, ఫ్రిడ్జ్‌లు, ఫ్యాన్లు, మోటర్లు, మొబైల్స్ కాలిపోయాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తమ ఇళ్లల్లో విలువైన వస్తువులు కాలి పోయాయని బాధితులు వాపోయారు. ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలా జరిగిందని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో త్వరగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు.

నిబద్ధతతో పనిచేయడం గొప్ప విషయం

- పారిశుధ్య కార్మికులను సన్మానించిన కౌన్సిలర్

గద్వాల టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో బుధవారం పారిశుధ్య కార్మికులను స్థానిక కౌన్సిలర్ శ్రీమన్నారాయణ ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గడచిన ఐదేళ్లుగా తాను ప్రాతినిధ్యం వహించిన 9వ వార్డు పరిధిలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పారిశుధ్య పనులను సమర్థంగా నిర్వహించడంతో పాటు తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణలో తమవంతు బాధ్యతగా కార్మికులు నిబద్ధతతో పనిచేయడం పట్ల కౌన్సిలర్ కృతజ్ఞతలు తెలిపారు.

మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తన వార్డు పరిధిలో పౌర సేవలందించిన 30మంది కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు ఉన్నారు.



కార్మికులను సన్మానిస్తున్న కౌన్సిలర్, కాలనీవాసులు